ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(శాంతి ఆశ్రమంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 13-10-97)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు. ఈశ్వరుడు మన హృదయంలోనే ఉంటే మనకు ఎందుకు కనిపించటం లేదు? మనకంటికి కనిపించనంతమాత్రంచేత, మన సంకల్పానికి అందనంత మాత్రంచేత భగవంతుడు లేడు అనికాదు. ఈశ్వరుడు ఉన్నాడు. ఉన్న ఈశ్వరుడు మనకు లేనట్లుగా అనిపిస్తోంది, లేని ప్రపంచం ఉన్నదానివలె మనకు కనిపిస్తోంది. ఇదేమాయ. ఈశ్వరుడు గుణాతీతుడు. మనం గుణాలతో, వికారములతో నిండి ఉన్నాము. భగవంతుడు మన హృదయంలో ఉన్నప్పటికి మనం గుణాలతో ఉండటం వలన ఆయన మనకు తెలియటంలేదు. అందుచేత ప్రకృతి గుణాల నుండి విడుదలపొందితే గుణాలు లేని ఈశ్వరుడు మన హృదయంలో తానుగా స్వయంగా ప్రకాశిస్తాడు. ఈ ప్రపంచంలో చావులేని వస్తువు ఒకటి ఉంది. అది ఎవరు అంటే ఈశ్వరుడే. ఆయనలో మనం ఐక్యం అయ్యేవరకు మనం ఇలా జన్మిస్తూ ఉంటాము మరణిస్తూ ఉంటాము. అమృతస్థితి ఒక్క ఈశ్వరుడిలోనే ఉంది. ఆఈశ్వరుడిని మనం పొందితే మరణాన్ని జయించి అమృతస్థితిని పొందుతాము,

జీవుడు లక్షణాలు ఏమిటి అంటే జరిగిపోయిన విషయాలు తలపెట్టుకొంటూ ఉంటాడు, భవిష్యత్ గురించి బెంగపడుతూ ఉంటాడు. ఇది అంతాకూడా ఈశ్వరసంకల్పముతో నడుస్తోంది అనే భావన స్థిరపడితే మనకు చింత తగ్గుతుంది. ఋషికి మనకు తేడా ఏమిటి అంటే అనుకూల పరిస్థితులలోను, ప్రతికూల పరిస్థితులలోను కూడ ఋషి ప్రశాంతంగా ఉంటాడు. కాని మనం అనుకూల పరిస్థితులలో ఒకలాగ ఉంటాము, ప్రతికూల పరిస్థితులలో ఒకలాగ ఉంటాము. కారణం ఏమిటి అంటే అంతా ఈశ్వర సంకల్పముతో నడుస్తోంది అని మనం చెప్పే మాటలు చిలకపలుకలే. అవి మనకు అనుభవంలో లేవు. మనం నోటితో చెప్పే ఈ మాటలు ఋషికి అనుభవంలో ఉంటాయి. మన హృదయంలో ఉన్న వస్తువు గురించి మనకు తెలియదు. ఋషికి వారి హృదయంలో ఉన్న వస్తువు వారికి తెలుస్తూ ఉంటుంది. అది తెలిస్తే మోక్షం, తెలియకపోతే బంధం. నీకు అంతర్ దృష్టిని కలుగజేసి హృదయం యొక్క లోయలలో ఉన్న మరణం లేని వస్తువు దగ్గరకు నిన్ను తీసుకొని వెళ్ళటమే గురువు చేసే పని, దైనందిన జీవితంలో మనం ఏపని చేసినప్పటికి గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి. అంతా ఈశ్వర సంకల్పముతోనే జరుగుతోంది అని మనం నోటితో చెప్పే మాటలు మనకు అనుభవంలోనికి వస్తే ఆ క్షణంలో దు:ఖం నశిస్తుంది. శాస్త్రంలో ఏ విషయం అయితే చెప్పాడో దానియందు శ్రద్ధ కలుగజేసి దానిని అనుభవంలోనికి తీసుకొని రావటానికి

సహాయసహకారములు అందించేవాడే గురువు.

ఇంకో క్షణంలో ఏతలంపు వస్తుందో మనకు తెలియదు. కాని హృదయంలో ఉన్న కంట్రోలర్‌కు తెలుస్తుంది. వాడే ఈశ్వరుడు. ఈశ్వరుడు ఉన్నాడు. ఎక్కడ ఉన్నాడు అంటే మన హృదయంలోనే ఉన్నాడు. మనం చేసేపూజలు, జపాలు,ధ్యానాలు, విచారణలు అన్నీకూడా ఆహృదయంలో ఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటంకోసమే. నీవు తెలుసుకోవాలనుకొనే వస్తువు నీకు దూరాన లేదు. నీ దేహముకంటే, నీ ఇంద్రియాలకంటే నీకు అత్యంతసమీపంగా ఉంది. నీకు అత్యంత సమీపంలో ఉండటమేకాదు అది నీవై ఉన్నావు. దేనిని తెలుసు కోవటానికి నీవు తపస్సులు చేస్తున్నావో అది నీవైఉన్నావు. ఆవస్తువు నీవే అన్న సంగతి నీకు ఇంకా అనుభవంలోనికి రాలేదు. ఏవిద్య అయితే నీహృదయంలో ఉన్న వస్తువును ప్రత్యక్షంగా అనుభవంలోనికి తీసుకొని వస్తుందో అదే నిజమైన విద్య. నీ హృదయంలో ఉన్న వస్తువును ఎవడైతే నీకు పట్టిఇస్తాడోవాడే నిజమైన గురువు, వాడే మహాజ్ఞాని. భక్తిలేకపోతే సాధన సిద్ధించదు. చిన్న పని అయినా మనం భక్తితో చేస్తే అది అనంతమైన ఫలితాన్ని ఇస్తుంది. అలవాటు చేసుకోవటం తేలిక, అందులోనుండి విడుదల పొందటం చాలా కష్టం . మన అలవాట్లే మనకు సంకెళ్ళు, బంధాలు. మనకు ఉన్న అలవాట్లలోనుండి విడుదల పొందటానికి సహాయం చేసేదేయోగం. నీమనోవృత్తిలోనుండి విడుదల చేసేదేయోగం. నీ శరీరాన్ని, నీఇంద్రియాలను, నీమనస్సును ఎలా నియమించుకోవాలి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలి అని నేర్పేదేయోగం.

తలంపు రాకుండా మాట్లాడము, తలంపు రాకుండా పనిచేయము. ముందు తలంపు వస్తుంది తరువాత పనిచేస్తాము. మనకు మంచి తలంపు వస్తే మంచిపనులుచేస్తాము, మంచి మాట్లాడతాము. అంటే మాటను, పనిని తలంపు నియమిస్తోంది. ఆతలంపును ఈశ్వరుడు చూస్తాడు. ఒకోసారి మన ఆలోచన ఒకరకంగా ఉంటుంది, మనం మాట్లాడేమాట ఇంకోరకంగా ఉంటుంది, చేసే పని మరోరకంగా ఉంటుంది. మామనస్సు కుదురుగాలేదు, అశాంతిగా ఉంది అని చాలా మంది చెపుతారు దానికి కారణం ఇదే. ఆలోచనకు, మాటకు సంబంధం ఉండదు. మాటకు చేతకు సంబంధం ఉండదు. ఈ మూడింటికి సంబంధం లేకపోతే వారికి శాంతి ఎలావస్తుంది. అంతటా ఉన్నదేవుడే, గుడిలో ఉన్న దేవుడే నీహృదయంలో కూడా ఉన్నాడు. ఆదేవుని గురించి నీకు తెలియక పోయినా నేను అనే బుద్ది అందరికి ఉందికదా. అది నీకు తెలుస్తోందికదా. ఆనేను అనే బుద్ధి ఎక్కడ నుండి ఉదయించి వస్తోందో అక్కడే దేవుడు ఉన్నాడు. నేను అనే బుద్ధి యొక్క ఆదిని నువ్వు చూస్తే నీలోపల ఉన్న ఈశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు.

ధ్యానం చేసేవాడికి ముందు ఈశ్వరుడి మీద ప్రేమ ఉండాలి, ఈశ్వరుని పొందాలనే

కాంక్ష ఉండాలి. ఇవి ఉంటే ధ్యానం కుదురుతుంది. ధ్యానం చేసేవాడు కూర్చొన్న వెంటనే ధ్యానం చేయకూడదు. ముందు కొద్దిసేపు జపం చేస్తే అపుడు ధ్యానం చేయటానికి మనస్సు ప్రిపేర్ అవుతుంది. సరాసరి ధ్యానం అందుకోవటం కష్టం. ధ్యానం చేయటం వలన ఏకాగ్రతకలుగుతుంది, మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది., మనోవృత్తి నశిస్తుంది. అన్ని నియమాలలోనికి ఆహారనియమము అత్యంత ముఖ్యమైనది. ఆహారంలో శుద్ధి ఉంటే మనబుద్ధి శుద్ధి అవ్వటానికి అది సహకరిస్తుంది. మనం పూర్వజన్మలో ఏమార్గంలో ప్రయాణం చేసామో ఆమార్గం వైపుకు ఇపుడు ఆకర్షింపబడతాము. ఒకమార్గం ఎక్కువ ఒకమార్గము తక్కువ అనికాదు. నీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, వాడిని పొందటానికి నీవు విచారణమార్గం ద్వారాగాని, కర్మమార్గముద్వారాగాని, ధ్యానమార్గముద్వారాగాని, ప్రాణాయామం ద్వారాగాని, మీకునచ్చినమార్గంలో ప్రయాణంచేసి నీహృదయంలోనికి వెళ్ళి అక్కడస్థిరపడు. నీకు నేను అనేతలంపు తెలుస్తోందికదా దానిని విచారణ చేస్తూ ఉంటే దాని మూలంలోనికి అది వెలుతుంది. అది జ్ఞానమార్గం. అలా చేయలేకపోతే ఈ నేనును భగవంతునికి అర్పించు ఆయన బాగు చేస్తాడు. అది శరణాగతి మార్గం. ఈ సృష్టిలో ఏదీనాదికాదు అనుకొని పనిచెయ్యి. అది జ్ఞానమార్గం లేనిచో ఈసృష్టి అంతానాది అనుకొని పనిచెయ్యి. అది కర్మమార్గం. కాని ఈరెండు మార్గములకు భక్తి యొక్క సపోర్టు ఉండాలి.

మనకు కోరికలు వస్తూ ఉంటాయి. కోరికలు నెరవేరినా కష్టమే, నెరవేరక పోయినా కష్టమే. నెరవేరితే నేను ఇది సాధించాను అని గర్వం వస్తుంది. నెరవేరకపోతే దుఃఖం వస్తుంది. రెండుబాధలే. నెరవేరితే గర్వం, నెరవేరకపోతే దుఃఖం ఎలా అయినా మనస్సుకు అశాంతిని తీసుకొనివస్తాయి. కోరికనెరవేరినపుడు ఆనందం వస్తుంది. ఆనందం ఎక్కడో బయట నుండి రావటంలేదు. నీ హృదయంలో నుండే వస్తోంది. కోరిక నెరవేరినపుడు మనస్సు దానిపుట్టు స్థానమైనహృదయంలోనికి వెళుతుంది. అక్కడ ఆనందం ఉంది కాబట్టి ఆ ఆనందాన్ని మనస్సుపీల్చుకొంటుంది. ఏదైతే నిరంతరము చింతిస్తున్నామో అదే మనం అవుతాము. లోకం గురించి ఎక్కువగా చింతిస్తూ ఉంటే లోకానికి దగ్గరవుతాము, దేవునికి దూరమవుతాము. దేవుని చింతిస్తూ ఉంటే దేవునికి దగ్గరవుతాము, లోకానికి దూరమవుతాము.

ఇతరులు నీ గురించి ఏమనుకొంటున్నారు అనే భావన నీకు ఉంటే లోకవాసన పెరుగుతుంది. కొంతమంది ఎంతసేపు ఇతరులు మాగురించి ఏమనుకొంటున్నారు అనే గొడవలోనే ఉంటారు. ఈపని చేసాము ఎంత గౌరవం వచ్చింది? అందరూ గౌరవిస్తున్నారా, లేదా అనుకొంటూఉంటారు. గౌరవం ఏవరికి? అహంకారానికే . చైతన్యానికి గౌరవం అక్కరలేదు. పుణ్యము పాపము, మంచిచెడు, గౌరవం అగౌరవం అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అనే గడప దాటితే చైతన్యములో ద్వైతములేదు. అది అఖండముగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది, శాంతముగా ఉంటుంది. ఇది మంచిపని అని అనుకొన్నప్పడుకూడా కొంతమంది ఆపనిచేయరు.

ఈపనిచేస్తే వారుఏమనుకొంటారు, వీరుఏమనుకొంటారు అని ఆలోచిస్తూ ఉంటారు. అలాకాదు ఇతరులు నీగురించి ఏమనుకొంటున్నారు అనే సమస్యవద్దు. ఈపని చేస్తే ఈశ్వరుడు సంతోషిస్తాడు అనుకొన్నప్పుడు లోకం అంతా వ్యతిరేకించినా ఆపని చేసెయ్యి. భయస్తులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు.

బయట సహాయం లేకుండా ఆత్మజ్ఞానం పొందగలనా అని అడుగుతున్నారు. ఆత్మజ్ఞానం సంపాదించాలి అనే కోరిక ఉదయిస్తూ ఉంటే ఈశ్వరుని అనుగ్రహం లేకుండా నీకు ఆకోరిక కలుగదు. దేవునికృప లేకుండా దేవుని తెలుసుకోవాలనే కాంక్ష నీకు ఉదయించదు. భగవంతుని అనుగ్రహం లేదు అని అనుకోవద్దు. సత్పురుషులతో సహవాసం చెయ్యాలి, నియమంగా జీవించాలి, జ్ఞానం సంపాదించాలి అనే కోరిక నీ మనస్సులో వస్తూఉంటే అది నీ తెలివి ఏమికాదు, అక్కడ దేవుని అనుగ్రహం పనిచేస్తోంది అని గుర్తుపెట్టుకో. సుఖం కూడా దేవుని ప్రసాదమే, కష్టం కూడా దేవుని ప్రసాదమే. ఎందుచేతనంటే దేవుడు ఒకోసారి కష్టాన్ని పంపించి నీమనస్సుకు అంతర్దృష్టి కలిగించవచ్చు. కొంతమంది చెపుతూ ఉంటారు మాఇంటిలోనివారు ఎవరూ మమ్మల్ని పట్టించుకోవటంలేదు, చూడటంలేదు అంటారు. అదికూడా దేవుని అనుగ్రహమే. ఇంటిలోని వారు బాగాచూస్తే వారిమీద మనకు మమకారం పెరుగుతుంది. వారు బాగాచూడకపోతే మమకారం తగ్గుతుంది. మనముఖం దేవునివైపుకు తిరుగుతుంది. మనం గ్రహిస్తే అది కూడా దేవుని అనుగ్రహమే అని మనకు తెలుస్తుంది. నీవు పూజచేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా నీవుచేసే సాధనవలన ఒక్క అంగుళం నీమనస్సును హృదయాభిముఖంగా పంపగలిగితే నీవుసాధనలోసక్సెస్ అయినట్లే. నీవు అరగంట ధ్యానం చేస్తే అందులో రెండు నిమిషాలు నీకు ధ్యాననిష్ట కుదిరినా నీవు అరగంట ధ్యానం చేసినట్లే. శ్రవణం, మననం కూడా సాధనలో ఒకభాగమే. డైరెక్టుగా చెప్పేది వినటం, విన్నదానిని అర్ధంచేసుకోవటం, మనకి అర్థమయితే ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ఆచరించిన తరువాత అనుభవం కలుగుతుంది. వినేటప్పడే మనం గందరగోళం చేసుకోకూడదు. ఎంతవరకు మనకు ఉపయోగపడితే అంతవరకు ఉపయోగించుకోవాలి, తరువాత వదిలి వేయాలి.

## శ్రీనాన్న గారి ప్రవచనములుః-

| | | | |
|---|---|---|---|
| పాలకొల్లులో (గరువు) | 23-11-97 | మురమళ్ళలో | 25-11-97 |
| పాతాళ మెరక | 28-11-97 | మురమళ్ళలో | 26-11-97, |